క్లుప్తంగా

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని 10వ వార్డుల్లో ప్రతి ఇంటికి మూడు పండ్ల, మూడు పూల మొక్కలను మున్సిపల్ చైర్పర్సన్ పి.సుఖేశిని, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలను పెంచడం వలన పర్యావరణ సమతుల్యం ఏర్పడుతుందన్నారు. కాలుష్యం అదుపులో ఉంచడం వంటి అంశాలను ప్రజలకు వివరించారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఖిల్లాఘనపురం: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని ఖిల్లాఘనపురం 3వ అంగన్వాడీ టీచర్ కవిత తెలిపారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కేంద్రంలోని గర్భిణులు, బాలింతలు తదితరులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఆకు కూరలు, కూరగాయలు, చిరు ధాన్యాలు తదితర వాటిని ఆహారంగా తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ



ఖిల్లాఘనపురం: అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మద్యం విక్రయిస్తున్న కిరాణం షాపులో పోలీసులు తనిఖీలు చేసి మద్యం సీసాలను పట్టుకుని సీజ్ చేసిన ఘటన మండలంలోని మామిడిమాడలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దాచేపల్లి రాములు కిరాణంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శ్రీహరి సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 23 బాటిళ్ల మద్యం పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నండటంతో మద్యాన్ని సీజ్ చేయడంతో పాటుగా యజమాని రాములపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి

పెబ్బేరు రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లు వెంటనే పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకొని నాయకులతో మాట్లాడి నిరసనను విరమింపజేశారు. అనంతరం వారు అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో భాస్కర్, సిరివాటి శ్రీనివాసులు, లక్ష్మయ్య, కురుమయ్య, పరశురాముడు, విష్ణు, నాగరాజు, రాజు, మల్లేష్, రాముడు, మహేష్, కొమ్ము దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకమండలి ప్రమాణ స్వీకారం



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవత నూతన పాలక మండలి శుక్రవారం కొలువుదీరింది. శుక్రవారం ఆలయంలో 13 మంది సభ్యులు ఈఓ రంగారావు ప్రమాణ స్వీకారం చేయించారు.

పాలక మండలి సభ్యులు

సి తిరుపతిరెడ్డి, బి సరోజ, ఎం బక్కయ్య, కె మాసయ్య, రాజేశ్వర్రెడ్డి, రమేష్, ఈ జగదీశ్వర్రెడ్డి, సి వెంకటస్వామి, అశోక్రెడ్డి, బంగారయ్య, ఉమేష్, బుదుగు జగదీశ్వర్ ఉన్నారు. కార్యక్రమంలో కొత్తపేట సింగిల్విండో చైర్మన్ రాజేందర్గౌడ్, వైస్ చైర్మన్ రాముయాదవ్, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్రావు, సర్పంచ్ శ్రీనివాస్రెడ్డి, ప్రేమ్రాజారావు, ప్రసాద్రావు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గణేష్రావు, మోహన్రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, నర్సింహ, బాలస్వామి ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



రేమద్దుల నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

పాన్గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉంటారని వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచించారు. మండలంలోని రేమద్దుల, గోప్లాపూర్ గ్రామాల్లో డ్రై డేలో భాగంగా శుక్రవారం పర్యటించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ, కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగీ, దోమలు వృద్ధి చెందకుండా, క్షయ వ్యాధి నివారణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో వారానికి ఒక్కసారి నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. నిల్వ నీటిలో దోమల నివారణ మందులను(అబేట్ ద్రావణం) కలిపారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

టీబీ వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడితే రోగం నయం అవుతుందన్నారు. 2 వారాలకు మించి ఎడతెరిపి లేని దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే తెమడ పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని కోరారు. వ్యాధి సోకిన వారు బయట తిరగకూడదని, ఉమ్మరాదని వారు సూచించారు. మరుగుదొడ్లను తప్పక వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శాంతమ్మ, సతీష్, నర్సమ్మ, నాగేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



మాట్లాడుతున్న సౌజన్య

వనపర్తి టౌన్: బాల్య వివాహాలు చేయడం, చేసేందుకు సహకరించడం చట్ట విరుద్ధమని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్డీఎస్) అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, కైలాశ్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సౌజన్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం కైలాశ్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, ఆర్డీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్వీఎంఆర్ డిగ్రీ కళాశాలలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మాయిలకు మైనర్గా ఉండగానే చదువును మధ్యలో ఆపించి వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని, వయస్సు, శరీర దృఢత్వం రాక ముందే గర్భం దాల్చడంతో భవిష్యత్లో అనేక అనారోగ్య సమస్యలకు గురవుతారని వివరించారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని ఇప్పటికే ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళలు, వారి రక్షణ, ఈవ్టీజింగ్పై సైతం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత, షీటీం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, చంద్రమౌళి, చంద్రశేఖర్, విశ్వకాంత్, కన్నన్ కుమార్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీపై హర్షం

గోపాల్పేట: మండలానికి చెందిన మైనార్టీ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్రెడ్డి చొరవ తీసుకుని కుట్టు మిషన్లు పంపిణీ చేయడంపై స్థానిక మైనార్టీ, బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ మైనార్టీల్లో సైతం పేదలు ఉన్నారని, వారిని గుర్తించి వారికి స్వయం ఉపాధి పొందేందుకు ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా మైనార్టీలు సైతం ఆర్థికంగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సీపీఎం బలోపేతానికి కృషి

మదనాపురం: మండల సీపీఎం కార్యదర్శిగా అజ్జకొల్లు గ్రామానికి చెందిన వెంకట్రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అధ్యక్షతన శుక్రవారం మండల సీపీఎం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇక్కడ కార్యదర్శి బాధ్యతలు నిర్వహించిన రాజుకు ఆత్మకూర్ మండల బాధ్యతలు అప్పజెప్పినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పినందుకు శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. పార్టీ జిల్లా కమిటీ ముఖ్య నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్రెడ్డి

పాన్గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులకు సంబంధించి నిర్వహించే సామాజిక తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్రెడ్డి ఆడిట్ టీం సభ్యులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 13వ విడత సామాజిక తనిఖీ నిర్వహించేందుకు వచ్చిన ఆడిట్ టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో 2022 జనవరి నుంచి మార్చి 2023వరకు జరిగిన ఉపాధి పనులపై గ్రామాల వారీగా జరిగిన పనులను క్షుణ్ణంగా పరిశీలన చేసి పూర్తి నివేదికలను తయారు చేయాలన్నారు. నివేదికలు సిద్ధం చేసే ముందు ఆయా పనులపై వాస్తవ పరిస్థితులను తెలుసుకొవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్రెడ్డి, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఎస్ఆర్పీలు రంజిత్కుమార్, శ్రీనివాసులు, డీఆర్ఓలు, వీఎస్ఏలు పాల్గొన్నారు.

ఎల్టీ రుణాల ఓటీఎస్ కాలపరిమితి పెంపు

కొత్తకోట రూరల్: రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలకు సంబంధించిన వన్టైం సెటిల్మెంట్ (ఓటీఎస్) కాలపరిమితిని పెంచాలని గత నెల 29న కొత్తకోట పీఏసీఎస్ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ కొట్టం వంశీధర్రెడ్డి టిస్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ నేతి మురళీధర్రావుకు విన్నవించారు. శుక్రవారం మహబూబ్నగర్ డీసీసీబీ కార్యవర్గ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ల సమక్షంలో ఓటీఎస్ గడువును డిసెంబర్ 31వ వరకు పెంచడమే కాకుండా పీఐ, ఐటీడీ మొత్తం మాఫీ అవుతుందని, ఎల్టీ రుణాలు తీసుకున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్రెడ్డి కోరారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొన్నారు. డీపీఎం బాషానాయక్, ఎంపీడీఓ విజయ్కుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ఉత్తమ ముగ్గులను ఎంపిక చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీరామ మహిళా సంఘం వారికి రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన తేజ మహిళా సంఘం వారికి రూ.2వేలు, తృతీయ స్థానంలో నిలిచిన మండల దివ్యాంగుల సంఘం వారికి రూ.1000 నగదు బహుమతిని అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ చీరలు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు యాదగిరి, ఏపీఎం రాంబాబు, ఏపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకం మన సంస్కృతి

బిజినేపల్లి: గ్రామీణ ప్రాంతాల మహిళలు తమ ఇంటి పెరటిలో కూరగాయలు పెంపకం చేపట్టాలని అదే మన సంస్కృతి అని పాలెం కేవీకే సమన్వయ కర్త డాక్టర్ ప్రభాకర్రెడ్డి అన్నారు. శుక్రవారం పాలెం కేవీకేలో ఆహార అనుబంధ స్థాపన రెండో రోజు ఉపాధి కూలీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ ఇంటి పెరటి ఆవరణలో కూరగాయల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ చేపట్టాలని, తీగ పందిళ్ల ద్వారా ఇంటిని ఆకర్శణీయంగా, ఆహ్లాదకర మార్చవచ్చన్నారు.

ప్లాస్టిక్ను నియంత్రిద్దాం

వనపర్తి టౌన్: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి నియంత్రించేందుకు మహిళలు పూనుకోవాలని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్పీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు చేటు వాటిల్లుతుందని, పర్యావరణాన్ని మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలని కోరారు. నారా సంచులు, జూట్ బ్యాగులను వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడంలో మహిళలు అవగాహనతో అడిగేస్తే ప్లాస్టిక్ వాడకం 90శాతం నిర్మూలించినట్లే అవుతుందని దీమా వ్యక్తం చేశారు.

జై బోలో గణేశ్ మహరాజ్కి..



ఆత్మకూర్లో కోలాటం ఆడుతున్న మహిళలు



నాగరాలలో సైకిల్పై..

ఆత్మకూర్: జైబోలో గణేష్ మహరాజ్కి అంటూ భక్తి పారవశ్యంతో భక్తులు వినాయక నిమజ్జనాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. స్థానిక భార్గవీనగర్, ఆర్కే కాలనీలో ప్రతిష్ఠించిన గణపయ్యలకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్కే కాలనీలో లడ్డును వేలంలో రూ.50వేలకు కొండాపురం రాము, సుభాషిని దంపతులు దక్కించుకున్నారు. భార్గవినగర్లో చైర్పర్సన్ గాయత్రి రవికుమార్ దంపతులు రూ.82వేలకు లడ్డును వేలంలో దక్కించుకున్నారు. అలాగే స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిమాత ఆలయం, శివాజీనగర్, నేతాజీనగర్, వినాయకనగర్లో భక్తులకు అన్నదానం చేశారు. వైస్ఎంపీపీ కోటేష్, ప్రతాప్రెడ్డి, కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన ర్యాలీలో పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని నాగల్కడ్మూర్లో వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం కనుల పండువగా శుక్రవారం జరిగింది. ఐదు రోజుల నుంచి పూజలందుకున్న గణనాథుడికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని బీసీ కాలనీలో గణేష్ మండపం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పరి తిరుమలేష్, గోపాల్ నాయక్, పులపాటి రాజు, మహమూద్ పాషా, సిద్దప్ప, గద్దెశివ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలో రాంనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడికి వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్ననాయుడు, చుక్కరాజు, వెంకటేష్నాయక్, అశోక్కుమార్, రాము పూజలు చేశారు.

శ్రీరంగాపురంలో..

మండలంలోని నాగరాల 3వ సెంటర్లో చిన్నారులు ప్రతిష్ఠించిన వినాయకుడు అందంగా అలంకరించిన సైకిల్పై వినాయకు నిమజ్జనానికి బయలుదేరాడు.



అమరచింత బీసీకాలనీలో..



ఆత్మకూర్లో లడ్డుతో చైర్పర్సన్ గాయత్రి రవికుమార్ దంపతులు



వనపర్తిలో..

రేవల్లి సీహెచ్సీలో హెల్త్ క్యాంపు



రోగులను పరీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు

గోపాల్పేట: ఆయుష్మాన్భవ ప్రత్యేక క్యాంపును ప్రజలు వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన రేవల్లి మండల కేంద్రంలోని సీహెచ్సీలో శుక్రవారం ఆయుష్మాన్భవ ప్రతేక హెల్త్ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, గర్భస్త సంబంధ పరీక్షలు, పిల్లలకు వైద్యం, శస్త్ర చికిత్స, చెవి, ముక్కు, గొంతు, కన్ను, మానసిక వ్యాధులకు చికిత్స అందిస్తారని తెలిపారు. అనంతరం రోగులకు బీపీ చెక్ చేశారు. క్యాంపునకు వచ్చే రోగులకు అందుబాటులో ఉండి బాధ్యతగా చికిత్సలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజ్కుమార్, డాక్టర్లు ప్రమోద్కుమార్, సురేందర్, అరుణ్జ్యోతి, మేఘనశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ రాజ్బోడాపై పోలీసులకు ఫిర్యాదు



పాన్గల్లో ఎస్ఐ వేణుకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

పాన్గల్: బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్కుమార్పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎన్ఆర్ఐ రాజ్బోడాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ నాయకులు శుక్రవారం పాన్గల్ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ కొల్లాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్చార్జ్ గోపాల్ మాట్లాడుతూ ఎలాంటి అధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తక్షణమే రాజ్బోడా బేషరత్గా ఆర్ఎస్పీ ప్రవీణ్కుమార్కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి అతడిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అనిల్, అంజి, శివ, కరుణాకర్, హరి, వినోద్ పాల్గొన్నారు.

చిన్నంబావి: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్కుమార్పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎన్ఆర్ఐ రాజ్బోడాపై చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షుడు బొల్లి కురుమయ్య పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, కేతపాగ సుధాకర్, పవన్, భాను, రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కులవృత్తిదారుల అభ్యున్నతికే 'బీసీ బంధు'



లబ్ధిదారులతో ఎంపీపీ, అధికారులు

పాన్గల్: గ్రామాల్లోని కుల వృత్తిదారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకే సీఎం కేసీఆర్ బీసీ బంధు ద్వారా రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తున్నారని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బీసీ, మైనార్టీ చేయూత చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన 47 మందికి బీసీ బంధు, మైనార్టీ బంధు ద్వారా రూ.లక్ష చెక్కులను అందజేశామన్నారు. కుల వృత్తిదారులను ఆదుకోవాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తుందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్రెడ్డి సహకారంతో న్యాయం చేస్తామని పేర్కొన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మహిళా సర్పంచ్లు, ఎంపీటీసీలు హాజరుకావాల్సి ఉండగా వారి బదులు భర్తలు సమావేశానికి హాజరై లబ్ధిదారుల చెక్కుల పంపిణీలో పాల్గొనడంపై మహిళా ప్రజాప్రతినిధులను విస్మరించడమేనని పలువురు చర్చించుకున్నారు. ఈ విషయంలో అధికారులు కూడా తమకు ఏమి పట్టనట్టు వ్యవహరించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఏడీ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వర్రెడ్డి, ఎంపీఓ రఘురాములు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాముయాదవ్, చంద్రశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేర్ రూరల్: పాఠశాల స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ క్రీడాకారిణిగా ఎంపికైన వనపర్తి మాంటిస్సోరి స్కూల్కు చెందిన నందిని, జిల్లా స్థాయి క్రీడాకారిణి సింధును కాంగ్రెస్ పెబ్బేర్ పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రాములు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్గౌడ్, మండల అధ్యక్షుడు విజయ్వర్ధన్రెడ్డి, గంధం రాజశేఖర్, కౌన్సిలర్ అశ్వని, సత్యనారాయణ, సాయిగౌడ్, రాములుయాదవ్, సర్వేశ్, సునీల్కుమార్, వినయ్, పాండు, ప్రధానోపాధ్యాయుడు రాజు, సూగురు శివ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వీపర్ల వేతనాలు పెంచాలి



పెబ్బేరు రూరల్: పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం పెంచి వారిని క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాసన్న డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం సమీపంలో స్వీపర్లు చేస్తున్న సమ్మె 89 రోజులకు చేరింది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, ఖాజపాషా, రషీద్, ఖయ్యాం , భాలస్వామి, కురుమన్న, గీత, నాగమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో కార్యాలయాలు ఉండాలి

వనపర్తి టౌన్: ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, పట్టణ శివారులో ఏర్పాటు చేస్తే ఇబ్బందులకు గురవుతారని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్యాదవ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన్న ఉన్న విద్యుత్ కార్యాలయాన్ని గోపాల్పేట రోడ్డులో ఉన్న హెడ్ ఆఫీస్ వద్దకు మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం ట్రాన్స్కో డీఈతో ఫోన్లో మాట్లాడారు. గతంలో గోపాల్పేట రోడ్డులో ఉన్న ఈ కార్యాలయాన్ని ప్రజల సౌకర్యార్థం పట్టణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేశారని, ఇప్పుడు మళ్లీ పాత చోటుకే మారిస్తే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. మంత్రి, కలెక్టర్తో విన్నవించి కార్యాలయాన్ని మార్చకుండా ఉండేటట్లు చూస్తానని, అప్పటి వరకు కార్యాలయాన్ని మార్చే పనులను ఆపాలని కోరారు.

ముందస్తు అరెస్టు

గోపాల్పేట: టీఎస్పీఎస్సీ ఉద్యోగాల భర్తీలో భాగంగా జీఓ 46తో చాలా మంది అభ్యర్థులకు నష్టం జరుగుతోందని ప్రగతిభవన్ను ముట్టడిస్తారన్న ఉద్దేశంతో శుక్రవారం ఉదయం ఇద్దరు అభ్యర్థులను ముందస్తు అరెస్టు చేసి సాయంత్రం వదిలిపెట్టామని గోపాల్పేట ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పంచాయతీ కార్మికుల నిరసన

కొల్లాపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడారు. గతంలో సమ్మె చేపట్టిన కార్మికులతో మంత్రి దయాకర్ రావు చర్చలు చేసి, పలు హామీలు ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలు ఆయన నెరవేర్చకపోవడంతో అక్టోబర్ 1న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.